క్లుప్తంగా

కొండలమ్మ ఆలయంలో భక్తుల సందడి

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

వెంకన్న సన్నిధిలో సుదర్శన హోమం



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సుదర్శన హోమాన్ని మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. హోమంలో భారీగా పాల్గొన్న భక్తులు స్వామిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసమారాధనను నిర్వహించారు.

ఉచితంగా మధుమేహ వైద్య పరీక్షలు



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రోగులకు గుడివాడకు చెందిన వైద్యురాలు జి.రజినీ వైద్య పరీక్షలు చేశారు. దాతలు నర్రా గంగాధరరావు(వెస్టిండీస్), కొసరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని రామకృష్ణ ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ శిబిరంలో 105 మందికి పరీక్షలు జరిగాయని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. 15 రోజులకు సరిపడా మందులను రోగులకు పంపిణీ చేశారు. లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్, కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు పాల్గొన్నారు.

బాలిక ఆచూకీని రెండు గంటల్లోనే గుర్తించాం



గుడివాడరూరల్: తల్లి మందలించిందని ఇంట్లో నుంచి వెళ్లిపోయిన బాలిక ఆచూకీని రెండు గంటల్లోనే కనుగొన్నామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాలికను తల్లికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తల్లి మందలించిందని శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలిక కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 10 ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ప్రారంభించామన్నారు. ఏలూరు జిల్లా కొత్తూరు గ్రామం వద్ద బాలిక ఆచూకీ లభ్యమైందన్నారు. బాలికను తల్లి నాగమల్లేశ్వరికి అప్పగించామన్నారు. బాలిక ఆచూకీ రెండు గంటల్లో గుర్తించిన ఎస్ఐ చంటిబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, గుడివాడ తాలూకా సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించినట్లు ఎస్ఐ తెలిపారు.

అపూర్వ సమ్మేళనం



పమిడిముక్కల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఆదివారం పూర్వ విద్యార్థులు సమ్మేళనం వైభవంగా జరిగింది. 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని చదువుకునే రోజుల్లో జరిగిన సంఘటనలకు గుర్తుచేసుకున్నారు. ఆనాటి గురువులు సురేష్, స్వామి, శ్రీధర్, స్వర్ణలత, శర్మ, వేణు, రజా, నారాయణను ఘనంగా సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు.

అదుపు తప్పిన అంబులెన్స్

కనుమూరు(పామర్రు): విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో కనుమూరు వద్ద ఆదివారం అంబులెన్స్ అదుపు తప్పి ప్రమాదం సంభవించింది. విజయవాడ ప్రభుత్వ వైద్యశాల నుంచి మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు గుడివాడకు చెందిన ఓ పేషెంట్‌ను ప్రైవేట్ అంబులెన్స్ జాతీయ రహదారిలో తీసుకెళుతుండగా కనుమూరు వద్ద ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ సంఘటనలో అంబులెన్స్‌లో ఉన్న పేషెంట్‌తో పాటు సహాయకంగా వచ్చిన వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే మరొక అంబులెన్స్ లో క్షతగాత్రులను మచిలీపట్నం తరలించారు.

ప్రజా సేవలు అందేనా..!

- నేటికీ తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్లు
- సంక్షేమ పథకాల అర్హులకు తప్పని ఇక్కట్లు

'గత ప్రభుత్వానికన్నా మెరుగైన పాలన అందిస్తాం.. అర్హులకు సంక్షేమ పథకాలు సకాలంలో ఇస్తాం ..' అంటూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన అనంతరం సచివాలయాల సేవలకు తూట్లు పొడిచారు. మొత్తానికి కూటమి ప్రభుత్వం ప్రజా సేవలకు కోతలు పెడుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మల్లాయపాలెం-2 సచివాలయం

సచివాలయాల వివరాలు

- గుడివాడ 9
- నందివాడ 12
- గుడ్లవల్లేరు 17

గుడివాడ రూరల్: ప్రజలకు అవసరమైన రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, రైతుభరోసా తదితర వెబ్‌సైట్లు ఇప్పటికీ తెరుచుకోలేదు. సచివాలయాల్లో ప్రజా సేవలను క్రమేణా కూటమి ప్రభుత్వం తగ్గించింది. ప్రస్తుతం సచివాలయాల్లో కేవలం ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర సాధారణ సేవలు మాత్రమే అందుతున్నాయి. నూతన రేషన్‌కార్డులు, పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కుదరడం లేదు. కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆశతో సచివాలయాలకు వచ్చి నిరాశతో వెనుతిరిగి వెళుతున్నారు.

పెన్షన్ల కోసం ఎదురు చూపులు

బీసీలకు సంబంధించి 50 ఏళ్ల వయస్సు నిండిన వారికి పెన్షన్ ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలయ్యే ముందు అనేక మంది పెన్షన్ల కోసం దరఖాస్తు చేశారు. వారందరూ పెన్షన్ కోసం ఇప్పుడు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలైన తేదీన వెబ్‌సైట్లు మూతపడ్డాయి. ఎన్నికలు పూర్తయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు వెబ్‌సైట్లు ఓపెన్ కాలేదు. ఎప్పుడు ఓపెన్ అవుతాయా అని అర్హులు ఆశగా ఎదురు చూస్తున్నారు. పథకాలు అందేది దేవుడికెరుగు. అసలు దరఖాస్తు చేసుకునేందుకు వీల్లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా ఎన్ని నెలలు ఎదురు చూపులు చూడాలని అర్హులు ప్రశ్నిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు పెద్దపీట వేశారు. సచివాలయాలు ఏర్పాటు చేసి వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లారు. సంక్షేమ పథకాలు కావాలన్నా, దరఖాస్తు చేసుకోవాలన్నా మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా సత్వర సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ విధంగా ప్రజలకు సేవలు అందేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి వెబ్‌సైట్లు ఓపెన్ చేసే విధంగా చర్యలు చేపట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలు త్వరితగతిన అందేవిధంగా చర్యలు తీసుకోవాలని అర్హులైన వారు కోరుతున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదునెలలు గడుస్తోంది. సచివాలయాల్లో వెబ్‌సైట్లు ఓపెన్‌కాకపోతే అర్హులకు సంక్షేమ పథకాలు ఎలా అందుతాయి. అర్హులు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

– ఎస్.సత్యనారాయణ, ఎల్ఎన్‌పురం గ్రామస్తుడు

దరఖాస్తులకు అవకాశం కల్పించాలి



నూతనంగా రేషన్‌కార్డులు, పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వెంటనే అవకాశం కల్పించాలి. చాలా మంది అర్హులైన వారు రేషన్‌కార్డు, పెన్షన్లు పొందలేకపోతున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలి.

– టి.రాజేష్, గుడివాడ

14న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గుడివాడరూరల్: ఈ నెల 14వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ గద్దే పుష్పరాణి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

ప్రత్యేక పూజలు



మండవల్లి: మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం కార్తిక మాస పూజలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, అయ్యవారిరుద్రవరం, శోభనాద్రిపురం విశ్వేశ్వరస్వామి తదితర ఆలయాల్లో అర్చకులు పూజలు జరిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు చెక్



గుడివాడరూరల్: మల్లాయపాలెం సమీపంలోని టిడ్కో సముదాయాల వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు చేపట్టామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. టిడ్కో సముదాయం వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన మూడు సీసీ కెమెరాలను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

మత రాజకీయాలను దూరంగా ఉంచాలి



మాట్లాడుతున్న నరసింహరావు

గుడివాడ టౌన్: లౌకిక భారతదేశంలో మతోన్మాద శక్తులు రాజకీయాలు చేస్తున్నాయని వాటిని దూరం చేస్తూ లౌకిక పార్టీలను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహరావు అన్నారు. సీపీఎం నియోజకవర్గ 13వ మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతోన్మాద శక్తుల ప్రమాదాలను ఎదుర్కోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్పొరేట్ శక్తులు పెరిగిపోతున్నాయని, సామాన్యుడు పేదరికం వైపు వెళ్లిపోతున్నాడన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ పార్టీని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన జిల్లా మహాసభ ప్రతినిధుల కమిటీలో ఆర్‌సీపీ రెడ్డి కన్వీనర్‌గా, టి.లక్ష్మణరావు, వి.సుధాకర్, సీహెచ్ నాగమల్లేశ్వరరావు, పి.రజిని సభ్యులుగా సభ ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. కార్యక్రమంలో జి.గోపాల్, బి.అరుణ, పి.ప్రభుదాసు, పి.వీరమ్మ పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్‌కు ఘన నివాళి



పోతురాజును సత్కరిస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: తెలుగు భాషకు మణిమకుటం వంటి వారు సీపీ బ్రౌన్ అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక సరస్వతి గ్రంథాలయంలో తెలుగు భాషా వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సీపీ బ్రౌన్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దీనిని పురస్కరించుకుని ప్రముఖ కవి అప్పినేడు పోతురాజుకు సీపీ బ్రౌన్ సాహితీ స్ఫూర్తి పురస్కారం-2024 ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆంగ్లేయుడిగా పుట్టి ఉద్యోగరీత్యా ఆంధ్రదేశ్‌లోని కడప జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన బ్రౌన్ తెలుగుభాష విశిష్టతను తెలుసుకుని ఆయన పడిన తపన శ్లాఘనీయం అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి బ్రౌన్ గట్టి పునాదులు వేశారన్నారు. వేమన పద్యాలను ఇంగ్లిష్ లోకి తర్జుమా చేయడమే కాకుండా తెలుగుభాషకు ఇంగ్లిష్ డిక్షనరి(సీపీ బ్రౌన్ నిఘంటువు) రాయించిన తెలుగు అభిమాని అని కొనియాడారు. కార్యక్రమంలో వంగిపురపు రాఘవాచారి, కేసీహెచ్ గాంధిబాబు, డీఆర్‌బీ ప్రసాదు, ఎం.మాధవరావు, షేక్ ఫరీద్‌బాషా, వి.శ్రీనివాస్, జి. శ్రీనివాస్, డి.ఆనంద్ మోహన్‌బోస్, ఎ.వెంకటేశ్వరరావు, సీహెచ్ రూప పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

▪ వెంకటగురుమూర్తిని సన్మానించిన ఎమ్మెల్యే

పామర్రు(తోట్లవల్లూరు): ఏపీ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన తోట్లవల్లూరు మండలానికి చెందిన వీరంకి వెంకటగురుమూర్తిని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం మండలంలోని పలువురు పార్టీ నేతలు, నాయకులు కార్యకర్తలు గురుమూర్తిని సత్కరించారు.

▪ బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శిగా బూరుబోయిన

కైకలూరు: రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శిగా కైకలూరు మండలానికి చెందిన బూరుబోయిన శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. శ్రీశైలంలో రాష్ట్ర సమావేశం ఆదివారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు వాకాని వెంగళరావు నియామక పత్రాన్ని అందించారు.

▪ కొండలమ్మను దర్శించుకున్న ముడా చైర్మన్ ప్రసాద్

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (ముడా) నూతన చైర్మన్ ఎం.ప్రసాద్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ ఈఓ ఆకుల కొండలరావు దుశ్శాలువాతో సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

▪ నేడు రామకృష్ణ సేవా సమితిలో ప్రవచనం

కైకలూరు: ఎన్జీఓస్ కాలనీ రామకృష్ణ సేవా సమితిలో సోమవారం సాయంత్రం ఐదు గంటలకు సత్సంగం, ప్రవచనం నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వరవర్మ ఆదివారం తెలిపారు. తిరుపతికి చెందిన రామకృష్ణ మిషన్ పాలకమండలి సభ్యురాలు, తెలుగు భాషోద్యమ సంఘం అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి సత్సంగం, ప్రవచనం చెబుతారని పేర్కొన్నారు.

▪ పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి

కైకలూరు: పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేరుగాంచిన ఆటపాక పక్షుల కేంద్రంలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. కార్తీకమాసం కావడం అందులోనూ ఆదివారం సెలవు కావడంతో ఏలూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పక్షి ప్రేమికులు విచ్చేశారు. బోటు షికారు చేస్తూ పెలికాన్ పక్షుల కేరింతలను దగ్గర నుంచి వీక్షించారు. గతంలో పెద్దలు ఒక్కొక్కరికి ప్రవేశ చార్జీ రూ.20 ఉండగా దానిని రూ.40కు పెంచారు. పిల్లలకు రూ.10 నుంచి రూ.20కి పెంచారు. బోటు షికారుకు గతంలో రూ.300 ఉంటే ఇప్పుడు రూ.600 చేశారు. బోటు షికారు రేట్లు అమాంతం పెంచడంపై పక్షి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు.

▪ ప్రత్యేక శిబిరాలతో ఓటర్లకు మేలు

గుడ్లవల్లేరు: మండలంలో ఓటరు నమోదుతో పాటు మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఓటర్లకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలు మేలు చేకూరుస్తాయని గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని అంగలూరు, కౌతవరం, గుడ్లవల్లేరులో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ఆయన పరిశీలించారు. ఓటర్ల నమోదు చేర్పులు, మార్పుల ప్రక్రియపై జరుగుతున్న విధానాన్ని బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 17వ తేదీన కూడా ఈ శిబిరాలను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించనున్నామని పేర్కొన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ బి.లోకరాజు, ఆర్ఐ పి.శివకుమార్, వీఆర్వోలు శాయన ప్రకాష్, ఎంవీ లక్ష్మయ్య, సిబ్బంది ఉన్నారు.

▪ సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెంచేవూరుపాలెం సెంటరులోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం నాగబంధాల వద్ద పూజలు చేశారు.

16న ఐఎంఎఫ్ఎల్ డిపోలో ఆస్తుల వేలం

గుడివాడరూరల్: జనార్దనపురం పరిధిలోని టెలిఫోన్ నగర్‌లో ఉన్న ఐఎంఎఫ్ఎల్(గుడివాడ) డిపోలో ఉన్న ఆస్తులను ఈ నెల 16వ తేదీన వేలం వేయనున్నట్లు ఏపీ ఎస్‌బీసీఎల్, ఐఎంఎల్ఎఫ్ గుడివాడ మేనేజర్ సీహెచ్ విజయబాబు ఆదివారం తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు ఈ వేలం పాట డిపోలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు పాల్గొనాలని ఆయన కోరారు.

ఆటపాకలో ఆత్మీయ కలయిక

కైకలూరు: ఆటపాటలు.. ఒకరికొకరు పరిచయాలు.. నడుమ ఆటపాకలో ఆకివీడు లయన్స్ క్లబ్ జోన్ సోషల్ ఆత్మీయ సమావేశం ఆదివారం సందడిగా జరిగింది. జిల్లా 316 జీ లయన్స్ క్లబ్ జోన్-1, జోన్-2 చైర్మన్లు మద్రివాడ శ్రీనివాసరావు, వేగేశ్న వెంకట కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆటపాక పక్షుల కేంద్రంలో సమీప ఆర్‌వీఎస్.సూర్యనారాయణ నివాసం వద్ద కలయిక ఏర్పాటు చేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా జోన్-2 చైర్మన్ కృష్ణంరాజు దివ్యాంగుడికి ట్రై సైకిల్, ఇద్దరు విద్యార్థులకు సైకిల్స్, ఆకివీడు గ్రంథాలయానికి మైక్‌సెట్ వితరణగా అందించారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని రామనపూడి వద్ద ఆదివారం వాహనాల తనిఖీలను చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదన్నారు. అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కార్తిక భోజనాలు

కైకలూరు: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ఆటపాక కనకలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రామస్తుల సహకారంతో ఆదివారం కార్తిక భోజనాలు నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి క్షేత్రంలో లక్ష బిల్వార్చన, రుద్రహోమం జరిగింది. ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు చొప్పెర్ల మురళీకృష్ణ ఆధ్వర్యంలో చొప్పెర్ల మురళీకృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా కార్తిక వన సమారాధన



ఉరుటూరు(పామర్రు): మండలంలోని ఉరుటూరులో కార్తిక మాసం పురస్కరించుకుని ఘనంగా వన సమారాధన కార్యక్రమం స్థానిక జమ్మిచెట్టు వద్ద నిర్వహించారు. రాముల వారి దీపపు స్తంభం వద్ద భక్తులు కారుమూరి వెంకట సత్యనారాయణ రెడ్డి రమాదేవి దంపతులు పీటలపై కూర్చుని పూజలను చేశారు. గురువు ఉయ్యూరు సీతారామయ్య ఆధ్వర్యంలో భక్తి గీతాలను ఆలపించి కోలాటం చేయించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ముప్పిడి శ్రీ నవత, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో రూ.12 లక్షల ఎన్ఆర్‌జీఈఎస్ నిధులతో 220 మీటర్ల సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఆదివారం పీఆర్ ఏఈ కమలేశ్వరరావు మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణపు పనులు నాణ్యతా ప్రమాణాలతో చేయాలన్నారు.

ఉపాధ్యాయుడు బెనర్జీకి సత్కారం



కైకలూరు: సహజ కవిగా పేరు గడించిన కైకలూరు ఓరియంటల్ స్కూల్ ఉపాధ్యాయుడు దండే బెనర్జీకి రాజమహేంద్రవరంలో సన్మానం చేశారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో శ్రీశ్రీ అంతర్జాతీయ సాహితి సంస్థ, నన్నయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన 141వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం, గోదావరి కవనోత్సవం శనివారం జరిగింది. బెనర్జీ ఉదయకాలపు రవిని అనే శీర్షికతో కవితా గానం చేసి ప్రశంసలందుకున్నారు.

శ్మశాన వాటిక కోసం ఆందోళన



సోమేశ్వరం కాలనీ వద్ద ప్రజలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దారు ఇబ్రహీం

కైకలూరు: క్రైస్తవ శ్మశాన వాటిక కోసం రెవెన్యూ అధికారులు వెంటనే స్థలం కేటాయించాలని ఆలపాడు గ్రామ శివారు సోమేశ్వరం కాలనీ ప్రజలు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఇటీవల నేషనల్ హైవే అధికారులు రెండు లైన్ల పై ఓవర్ బ్రిడ్జిని సోమేశ్వరం కాలనీ వద్ద నిర్మించారు. దీంతో చుట్టూ తిరిగి మూడు కిలోమీటర్ల దూరంలో శ్మశానానికి మృతదేహాలను తరలించాల్సి వస్తోంది. ఆదివారం గ్రామానికి చెందిన యువకుడు మరణిస్తే హైవే బ్రిడ్జి సమీప స్థలంలో మృతదేహాన్ని పూడ్చారు. విషయం తెలుసుకున్న హైవే అధికారులు కైకలూరు ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీంకు ఫిర్యాదు చేశారు. ఆయన పోలీసు సిబ్బందితో కలిసి వివాదా స్థలం వద్దకు వెళ్లారు. అప్పటికే మృతదేహాన్ని సమాధి చేశారు. శ్మశాన వాటిక స్థలం లేకపోవడంతో ఇక్కడ సమాధి చేస్తున్నామని స్థలం కేటాయించాలని తహసీల్దారును కాలనీ వాసులు కోరారు. సమస్యను పరిష్కరించకపోతే ఇకపై ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని హైవే రోడ్డుపై పెట్టి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమస్యపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఆర్డీఓకు వినతిపత్రాలు అందించామని పేర్కొన్నారు. హైవే అధికారులు సేకరించిన భూమిలో సమాధులు చేయకూడదని, విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు పంపిస్తానని ఇన్‌చార్జి తహసీల్దారు తెలిపారు.

ఘనంగా పద్మశాలిసంఘు వార్షికోత్సవం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సంఘ సభ్యులు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ భద్రావతి సమేత భావనారుషి పద్మశాలి సంఘ వార్షికోత్సవ వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కూచిపూడి, పెదపూడి, పెడసనగల్లు, భట్లపెనుమర్రు, మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి ప్రాంతాల నుంచి తరలివచ్చిన 300 మందికి పైగా సంఘ సభ్యులు సత్యనారాయణ స్వామికి, భావనారుషి, కార్తీక దామోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తిక వన సమారాధన నిర్వహించిన ప్రాంగణంలో పిల్లలు ఆటపాటలతో గడిపారు. కార్యక్రమాన్ని ఆ సంఘ అధ్యక్షుడు కొండవీటి అమరబాలేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చెరుకు శ్రీనివాసరావు, కార్యదర్శి కొతవరపు సుబ్బారావు, కోశాధికారి కాటూరి శ్రీకాంత్, సభ్యులు పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు అందె జగదీష్, కూచిపూడి సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో నడుచుకోవాలి

గుడివాడరూరల్: రౌడీషీటర్లు నేరాలకు దూరంగా క్రమ శిక్షణతో జీవించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు.